సాక్షి అనంతపురం

మంగళవారం ၊ 12 ၊ ఆగస్టు ၊ 2025



చీనీ టన్ను రూ.16 వేలు

అనంతపురం మార్కెట్‌యార్డులో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.16 వేలు పలికాయి.



టమాట కిలో రూ.46

అనంతపురం కక్కలపల్లి మండీలో సోమవారం కిలో టమాట గరిష్ట ధర రూ.46 పలికింది. కనిష్టం రూ.34, సరాసరి రూ.27 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం

32.7°/21.4°

జిల్లా అంతటా సోమవారం ఉష్ణోగ్రతలు తగ్గాయి. ఆకాశం మేఘావృతమై మోస్తరుగా వర్షపాతం నమోదైంది. ఆగ్నేయం నుంచి పశ్చిమ దిశగా గంటకు 6 నుంచి 12 కిలో మీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

ఢిల్లీ 'స్వాతంత్య్ర' వేడుకలకు ఆర్ట్స్ కళాశాల విద్యార్థిని



విద్యార్థిని సుమియాను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

అనంతపురం ఎడ్యుకేషన్: ఢిల్లీలో నిర్వహించే స్వాతంత్య్ర వేడుకలకు స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల విద్యార్థిని ఎస్. సుమియా (అర్థశాస్త్రం, తృతీయ సంవత్సరం) ఎంపికైంది. ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా జరిగే మూడు రంగుల జెండా ఆవిష్కరణలో సుమియా పాల్గొననుంది. ఈ సందర్భంగా సోమవారం సుమియాను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మశ్రీ, ఎన్‌ఎస్‌ఎస్ పీఓ బాలాజీ నాయక్, జయలక్ష్మి, సోమశేఖర్, సుధాకర్ తదితరులు అభినందించారు.

డెత్ క్లెయిముల పరిష్కారానికి కార్యాచరణ

అనంతపురం సిటీ: ఈపీఎఫ్‌ఓలో సభ్యులుగా ఉండి మరణించిన వారి డెత్ క్లెయిముల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించామని ఆ శాఖ కడప ప్రాంతీయ శాఖ కార్యాలయ కమిషనర్–1 రవితేజ్ కుమార్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈపీఎఫ్ఓ సభ్యులకు, యాజమాన్యాలకు, పెన్షనర్లకు మెరుగైన సేవలందించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. అపరిష్కృతంగా ఉన్న డెత్ క్లెయిములను వేగవంతంగా సెటిల్ చేసేందుకు సెప్టెంబర్ వరకు ప్రత్యేక కార్యక్రమం చేపట్టినట్లు వివరించారు. డెత్ క్లెయిముల సమస్య పరిష్కారం కాని పక్షంలో కడపలోని ప్రాంతీయ కార్యాలయంలో లేదా జిల్లా కేంద్రాల్లోని తమ శాఖ కార్యాలయాల్లో అందజేయాలని సూచించారు. ఈపీఎఫ్ సభ్యులు యూఏఎన్‌కి ఈ–నామినేషన్ జత చేసి ఉన్నట్లైతే మరణానంతరం వారి కుటుంబ సభ్యులు ఆన్‌లైన్‌లోనే డెత్ క్లెయిములు సమర్పించాల్సి ఉంటుందన్నారు. సందేహాల నివృత్తి కోసం కడపలోని ప్రాంతీయ కార్యాలయంలో ప్రత్యేక సెల్ కూడా ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. సెల్: 94911 38280 నంబర్‌లో కార్యాలయ పని వేళల్లో సంప్రదించవచ్చని ఆయన తెలిపారు.

వానో... వాన

- జిల్లాలో 16.2 మి.మీ నగటు వర్షపాతం
- పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు, చెక్‌డ్యాంలు



అనంతపురంలోని రామ్‌నగర్‌లో బ్రిడ్జి పక్కన నిలిచిన వర్షపు నీటిలో వాహనదారుల ఇబ్బందులు

అనంతపురం అగ్రికల్చర్: ఆరు రోజులుగా జిల్లా అంతటా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. జూన్ 12 నుంచి ఆగస్టు 5 వరకు తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొనగా ప్రస్తుతం అధిక వర్షపాతం నమోదవుతోంది. ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు 28 మండలాల పరిధిలో 16.2 మి.మీ సగటు నమోదు కాగా సోమవారం పగలంతా కూడా చాలా మండలాల్లో మోస్తరుగా వర్షం కురిసింది. నార్పలలో 82.6 మి.మీ, యల్లనూరులో 82.2 మి.మీ భారీ వర్షం పడింది. శింగనమల 30.6 మి.మీ, పెద్దవడుగూరు 29.6, ఉరవకొండ 27.2, తాడిపత్రి 24.4, గార్లదిన్నె 22.4, పామిడి 20.4 మి.మీ వర్షపాతం నమోదు కాగా మిగతా మండలాల్లో కూడా మోస్తరుగా వర్షం కురిసింది. ఆగస్టు సాధారణ వర్షపాతం 83.8 మి.మీ కాగా ఇప్పటికే 122.6 మి.మీ నమోదైంది. మొత్తమ్మీద జూన్ 1 నుంచి 150.1 మి.మీ గానూ 205.2 మి.మీ వర్షపాతం నమోదైంది. ఈ సీజన్‌లో ఓవరాల్‌గా 12 వర్షపు రోజులు (రెయినీడేస్) నమోదయ్యాయి. జూన్‌లో రెండు, జూలైలో 4 రోజులు కాగా ఈ నెలలో ఇప్పటికే ఆరు రెయినీడేస్ రికార్డయ్యాయి. వారం రోజులుగా వర్షాలు పడుతుండటంతో జిల్లా వ్యాప్తంగా చాలా ప్రాంతాల్లో వాగులు, వంకలు, చెక్‌డ్యాంలు పొంగి ప్రవహిస్తున్నాయి. ఉద్యాన పంటలకు మేలు చేకూరుస్తుండగా... అధిక వర్షాల వల్ల వ్యవసాయ పంటలు కొంత దెబ్బతినే పరిస్థితి ఉంటుందని అధికారులు చెబుతున్నారు. వర్షాలు తెరపిచ్చిన తర్వాత ప్రత్యామ్నాయ పంటల సాగుకు అనుకూలమని శాస్త్రవేత్తలు తెలిపారు.



ఈ పిల్లల పేర్లు ఎం.తేజస్విని, ఎం.సుశాంత్. తేజస్విని 8వ తరగతి చదువుతుండగా సుశాంత్ 7వ తరగతి చదువుతున్నాడు. అనంతపురం రూరల్ మండలం పిల్లిగుండ్లకాలనీకి చెందిన ఈ పిల్లలకు తల్లీతండ్రీ ఇద్దరూ చనిపోయారు. చిన్నాన్న ఓబులేసు సంరక్షణలో ఉన్నారు. కూలీనాలి చేసుకునే వీరి కుటుంబానికి 'తల్లికి వందనం' పథకం లబ్ధి చేకూరలేదు. పిల్లలిద్దరి పేర్లు అనర్హుల జాబితాలో చేర్చారు. డబ్బు వస్తే పిల్లలకు ఉపయోగపడతాయనే ఆశతో వీరి చిన్నాన్న ఓబులేసు కలెక్టర్‌కు రెండు సార్లు, విద్యాశాఖ అధికారిని రెండుసార్లు కలిసి విన్నవించాడు. స్థానికంగా ఉన్న సచివాలయానికీ పలుమార్లు వెళ్లాడు. ఓబులేసును చూడగానే అధికారులు కసురుకోవడం తప్పితే సమస్య మాత్రం పరిష్కరించలేదు. దీంతో ఓబులేసు అధికారులను అడగడమే మానేశాడు. వీరిద్దరే కాదు కరెంటు బిల్లు అధికంగా చూపిస్తూ, వ్యవసాయ భూమి, నాలుగుచక్రాల వాహనాలు ఉన్నాయని పేర్కొంటూ, తల్లిదండ్రులు, పిల్లల పేర్లు తప్పుగా నమోదు తదితర కారణాలతో జిల్లాలో వేలాదిమందికి 'తల్లికి వందనం' పథకాన్ని దూరం చేశారు.



కొందరికే వందనం

- చాలామంది అర్హులకు అందని 'తల్లికి వందనం' డబ్బు
- అధికారుల వద్ద అందుబాటులో లేని లబ్ధిదారుల జాబితా
- ఒకరిపై ఒకరు చెప్పుకుంటున్న విద్యాశాఖ, సచివాలయ అధికారులు
- కనీసం సమాచారం కూడా చెప్పడం లేదంటూ లబ్ధిదారుల ఆవేదన

అనతంపురం ఎడ్యుకేషన్: జిల్లాలో ఇప్పటికీ వేలాది మంది అర్హులైన విద్యార్థులకు 'తల్లికి వందనం' అందలేదు. రకరకాల పేర్లతో కొర్రీలు వేశారు. రాష్ట్ర స్థాయిలో అన్ని లక్షలు, ఇన్ని లక్షలమందికి ఇచ్చామని చెబుతున్నా అర్హులుగా ఉండీ లబ్ధి చేకూరని వారు క్షేత్రస్థాయిలో కుప్పలుతెప్పలుగా ఉన్నారు.

అందుబాటులో లేని జాబితా..

సహజంగా ప్రభుత్వం ఏ పథకం అమలు చేసినా జిల్లాల వారీగా లబ్ధిదారులు ఎంతమంది ఉన్నారు, వారికి ఎంత మేర ఖర్చు చేశారనే వివరాలు ప్రకటించడం పరిపాటి. అయితే 'తల్లికి వందనం' పథకానికి సంబంధించి ఇప్పటికీ జిల్లాలో ఎంతమంది విద్యార్థులకు అందించారనే వివరాలు అధికారుల వద్ద లేవు. జిల్లాలో ఒకటో తరగతి నుంచి ఇంటర్ విద్యార్థులు దాదాపు 4,13,160 మంది ఉన్నారు. వీరిలో 'తల్లికి వందనం' పథకం ఎంతమంది విద్యార్థులకు అమలు చేశారు... ఎంతమందికి రాలేదనే వివరాలు లేవంటే పథకం అమలుపై ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి ఏపాటిదో అర్థం చేసుకోవచ్చని తల్లిదండ్రులు మండిపడుతున్నారు.

ఒకరిపై ఒకరు చెప్పుకుంటూ..

చాలామందికి లేని భూమిని చూపిస్తూ, నాలుగు చక్రాల వాహనం లేకపోయినా ఉన్నట్లు, కరెంటు బిల్లులు తక్కువ వచ్చినా ఎక్కువ వచ్చినట్లు చూపించి కోత విధించారు. ఇలాంటి వారు ప్రతి గ్రామంలోనూ ఉన్నారు. అందుకు సంబంధించిన ఆధారాలను అందజేస్తున్నా అధికారులెవరూ పట్టించుకోవడం లేదు. విద్యాశాఖ అధికారుల వద్దకు వెళ్తే... తమకు సంబంధం లేదని గ్రామ, వార్డు సచివాలయాలకు వెళ్లాలని చెబుతున్నారు. అక్కడికి వెళ్తే తమకు సంబంధం లేదు, విద్యాశాఖ అధికారుల వద్దకు వెళ్లాలని అంటున్నారు. ఒకరిపై ఒకరు చెప్పుకుంటూ తప్పుకుంటున్నారు తప్ప సమస్య మాత్రం పరిష్కరించడం లేదంటూ పలువురు లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా దిక్కులేదు..

చాలామంది లబ్ధిదారులు మండలాల్లో కాదని నేరుగా కలెక్టరేట్‌లో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేసినా దిక్కులేకుండా పోయింది. అక్కడికి వెళ్లినా సమస్య మళ్లీ మొదటకే వస్తోంది. కలెక్టర్, జేసీ ఏమో విద్యాశాఖ అధికారుల వద్దకు వెళ్లాలంటూ సిఫార్సు చేస్తున్నారు...డీఈఓ కార్యాలయానికి వెళ్లగానే తమకు సంబంధం లేదని చేతులెత్తేస్తున్నారు. ఇలా తిరిగితిరిగి విసిగిపోయిన వేలాదిమంది లబ్ధిదారులు చివరకు పథకం గురించి అడగడమే మానేశారు. 'తల్లికి వందనం' పథకం అమలు చేసిన రోజు...మీడియా ప్రకటన ఇవ్వాలనే ఉద్దేశంతో జిల్లాలో ఒకటో తరగతి నుంచి ఇంటర్ చదువుకునే విద్యార్థులు ఎంతమంది ఉన్నారు... వారిలో ఎంతమందికి డబ్బు పడింది.. ఎంత ఖర్చు చేశాం అనే వివరాలు కావాలంటూ స్వయంగా కలెక్టరేట్ నుంచి విద్యాశాఖను కోరినా తమకు తెలీదంటూ చేతులెత్తేశారు.

34 ఎకరాలున్నట్లు చూపించారు



నా కూతురు గోపిక 6వ తరగతి చదువుతోంది. 'తల్లికి వందనం' పథకం అందలేదు. మాకు 8 ఎకరాల మెట్ట పొలం ఉంటే 34 ఎకరాల భూమి ఉన్నట్లు చూపించారు. ఆ భూమి ఎక్కడుందో అధికారులే చూపించాలి.

– సునీత, వజ్రవన్నూరు, రాయదుర్గం మండలం

డబ్బు వేరే అకౌంట్‌లో వేశారు



నా ఇద్దరు పిల్లలను ప్రయివేట్ పాఠశాలలో చదివిస్తున్నా. ఇద్దరికీ డబ్బు పడలేదు. బాబుకు సంబంధించి వేరొకరి అకౌంట్‌లో డబ్బు వేశారు. పాఠశాల వారు సంబంధం లేదంటున్నారు. అధికారులను అడిగినా ఫలితం లేదు.

– సుగాలి గోవిందమ్మ, అయ్యవారిపల్లి, తాడిపత్రి మండలం

రూపాయి కూడా జమ కాలేదు



మాకు ముగ్గురు పిల్లలు. నేను, నా భార్య వ్యవసాయ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాం. గత ప్రభుత్వంలో వరుసగా నాలుగేళ్లు 'అమ్మ ఒడి(పథకం అందింది. కూటమి ప్రభుత్వంలో మాత్రం మాకు ఒక రూపాయి కూడా జమ కాలేదు.

– తిప్పేస్వామి, ఎరడికెర, బ్రహ్మసముద్రం మండలం

అన్ని అర్హతలు ఉన్నా రాలేదు



నాకు ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. అన్ని అర్హతలు ఉన్నా 'తల్లికి వందనం' రాలేదు. మా పేరిట 10 ఎకరాలకు పైగా భూమి ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. వాస్తవానికి నాకు, నా భర్తకు 8 ఎకరాలు ఉంది. మాకు లేని భూమి ఎలా చూపుతారని రెవెన్యూ అధికారులను అడిగినా న్యాయం చేయలేదు.

– వన్నూరక్క, శెట్టూరు గ్రామం

బాలిక హత్య కేసులో ముద్దాయికి యావజ్జీవం

హిందూపురం/పుట్టపర్తి టౌన్: బాలికను కర్కశంగా చంపి శవాన్ని పూడ్చిపెట్టిన కేసులో ముద్దాయికి యావజ్జీవ కారాగార శిక్ష, రూ.10 వేల జరిమానా విధిస్తూ అనంతపురం పోక్సో కోర్టు న్యాయమూర్తి చిన్నబాబు సోమవారం తీర్పు చెప్పారు. అలాగే సాక్ష్యాలను తారుమారు చేసినందుకు మరో ఐదేళ్ల జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధించారు. కేసు వివరాలిలా ఉన్నాయి. కర్ణాటకలోని గౌరీబిదనూరు తాలూకా నామగుండ్ల గ్రామానికి చెందిన మంజులకు ఇద్దరు కుమార్తెలు. గ్రామంలో తనకు ఎవరూ లేకపోవడంతో హిందూపురం మండలం తూమకుంట గ్రామంలోని తన అక్క రత్నమ్మ వద్దకు వచ్చి ఉండేవారు. రత్నమ్మ భర్త గంగాధర్ 'పొలం వద్దకు వెళ్దాంరా.. నీకేమైనా కొనిస్తాను' అంటూ మంజుల ఎనిమిదేళ్ల కుమార్తె (మూడో తరగతి విద్యార్థిని)ను రోజూ పిలిచేవాడు. గంగాధర్ అంతకు మునుపే రెండు కేసుల్లో జైలుకు వెళ్లొచ్చాడు. అతని ప్రవర్తన చూసి భయపడుతూ చిన్నారిని పంపేందుకు తల్లి మంజుల నిరాకరించేది. అయితే గత ఏడాది ఆగస్టు ఎనిమిదో తేదీన చిన్నారిని మచ్చిక చేసుకున్న గంగాధర్ పొలం వద్దకు పిలుచుకెళ్లాడు. అక్కడ క్రూరంగా చంపి.. అత్యాచారానికి ప్రయత్నించాడు. మృతదేహాన్ని సమీపంలోని పెన్నానదిలో పూడ్చిపెట్టాడు. సాయంత్రం ఒక్కడే ఇంటికి తిరిగొచ్చిన గంగాధర్‌ను తన కూతురు ఎక్కడని మంజుల అడిగింది. ఆమెతో పాటు బంధువులు కూడా నిలదీయడంతో చంపేసి నది వద్ద పూడ్చేశానని చెప్పాడు. దీంతో తల్లి హిందూపురం రూరల్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుణ్ని అరెస్టు చేశారు. దర్యాప్తు అనంతరం కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. 17 మంది సాక్షులను విచారించిన అనంతరం గంగాధర్‌పై అభియోగాలు రుజువు కావడంతో యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ పోక్సో కోర్టు న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

22న సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

కదిరి టౌన్: ఖాద్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో ఈనెల 22న ఉచిత సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహిస్తున్నట్లు ఈఓ వి.శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఆ రోజు ఉదయం 10 గంటల నుంచి వ్రతాలు ప్రారంభమవుతాయన్నారు. కార్యక్రమంలో పాల్గొనాలనుకునే వారు ఈనెల 18లోపు పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. స్వయంగా ఈఓ కార్యాలయానికి వచ్చి అప్లికేషన్ పూర్తి చేయడంతో పాటు ఆధార్ జిరాక్స్ ఇవ్వాల్సి ఉంటుందన్నారు.

మా రూటే సప 'రేటు'!

- ఎక్సైజ్ వారిలా తమకూ మామూళ్లివ్వాలంటున్న సివిల్ పోలీసులు
- వైన్ షాపుల నిర్వాహకులకు హుకుం
- స్టేషన్ పరిధిలో ఒక్కో వైన్‌షాపు నుంచి రూ.20 వేలు డిమాండ్

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఉమ్మడి జిల్లాలో ఎక్సైజ్ పోలీసులే కాదు సివిల్ పోలీసుల దందా మరీ ఎక్కువైంది. మద్యం షాపుల వారు మామూళ్లు ఇవ్వకపోతే బెదిరిస్తున్నారు. ఎక్సైజ్ పోలీసులూ, తాము ఒకటి కాదని, వాళ్లకిస్తే తమకిచ్చినట్టు కాదంటూ బహిరంగంగానే చెబుతున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రతి సివిల్ పోలీస్ స్టేషన్‌కూ మామూళ్లు వెళ్లకపోతే వైన్‌షాపు నడుపుకోలేరని హెచ్చరిస్తున్నారు. లేకుంటే పర్మిట్ రూములు, బెల్టుషాపులకు అనుమతి లేదంటున్నారు.

అడిగినంత ఇస్తే దర్జాగా..

మామూళ్లు ఇస్తే దర్జాగా వ్యాపారం చేసుకోవచ్చు. ఉదాహరణకు అనంతపురంలోని రామ్‌నగర్ బ్రిడ్జి కింద ఓపెన్ బార్‌లా వైన్‌షాపు నడుస్తోంది. మహిళలు ఈ మార్గంలో నడుచుకు వెళ్లాలంటే కూడా ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడి నుంచి నాలుగో పట్టణ పోలీసు స్టేషన్‌కు ప్రతి నెలా రూ.25 వేలు వెళ్తోంది. ఇలా శ్రీ సత్యసాయి, అనంతపురం జిల్లాల్లో దర్జాగా పర్మిట్ రూములు, బెల్టుషాపులు నడుపుకోవాలంటే ఎక్సైజ్ పోలీసులతో పాటు సివిల్ పోలీసులనూ సంతృప్తి పరచాల్సిందేనని తెలిసింది. నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు రాయాల్సింది ఎక్సైజ్ అధికారులే. కానీ తాము లేకుండా వ్యాపారాన్ని చేసుకోలేరని సివిల్ పోలీసులు చెబుతున్నట్లు సమాచారం.



అర్బన్‌లో ఎక్కువగా..

శ్రీ సత్యసాయి, అనంతపురం జిల్లాల్లో 230 వరకూ వైన్ షాపులు ఉన్నాయి. కొన్ని నియోజకవర్గాల్లో పోలీస్ స్టేషన్లలో ఇచ్చినంత తీసుకుని చూసీ చూడనట్టు వెళుతున్నారు. కానీ అనంతపురం అర్బన్‌లో మాత్రం కచ్చితంగా ఫిక్స్ చేసినంత ఇవ్వాల్సిందే. ఉదాహరణకు నాలుగో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో 9 షాపులున్నాయి. ఆయా వైన్ షాపుల నిర్వాహకులంతా కలిసి నెలకు తప్పనిసరిగా రూ.1.80 లక్షలు ఇవ్వాల్సిందే. బార్‌లూ ఫిక్స్ చేసినంత ఇవ్వాలి. వన్‌టౌన్ పీఎస్‌కు కూడా అంతేనని తెలిసింది.

ధాబాలు.. హోటళ్లు ఉంటే బోనస్

వైన్‌షాపులతో పాటు ధాబాలు, హోటళ్లు ఉంటే సివిల్ పోలీసులకు బోనస్ కింద లెక్క. జాతీయ రహదారిపై ఉన్న ప్రతి ధాబా, హోటల్‌లోనూ లిక్కర్ సిట్టింగ్ ఉంది. ఇక్కడ తనిఖీలకు వెళ్లాల్సింది కూడా సివిల్ పోలీసులే. దీంతో ధాబాలు, హోటళ్లు శక్తిని బట్టి నెల నెలా ఇవ్వాల్సిందే. ఇక బార్‌లు కూడా స్టేషన్‌కు మామూళ్లు పంపించాల్సిందే. పోలీసులేమో డ్రోన్‌లతో నిఘా అంటూ చెప్పి బహిరంగ మద్యపానం చేస్తున్నారంటూ రిక్షా కార్మికుడినో, తాపీ మేస్త్రీనో తెచ్చి స్టేషన్లో పెడుతున్నారు.

ఉమ్మడి అనంతపురం జిల్లాలో గణాంకాలు..	
మద్యం షాపుల నుంచి కేటగిరీల వారీగా నెలవారీ వసూళ్లు	
ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్	రూ.45,000
ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్	రూ.10,000
ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్	రూ.10,000
సివిల్ పోలీసులు	రూ.20,000

బాస్‌కు తెలిసే..

మామూళ్ల దందా 'పోలీస్ బాస్'కు తెలిసే జరుగుతోందని, ఇంత విచ్చలవిడిగా సాగుతున్న విషయం తెలియకుండా ఎలా ఉంటుందని ఓ పోలీసు అధికారి 'సాక్షి'తో చెప్పడం గమనార్హం. విచిత్రమేమంటే కొన్ని పోలీసుస్టేషన్లలో వచ్చిన సొమ్ము మొత్తం సీఐ తీసుకుంటున్నారని, తమకు పైసా ఇవ్వడం లేదని ఎస్ఐలు, కానిస్టేబుళ్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నట్టు తెలిసింది.

మా మొర ఆలకించండయ్యా..

అనంతపురం అర్బన్: తమ మొర ఆలకించి సమస్యలు పరిష్కరించండంటూ అధికారులకు ప్రజలు విన్నవించుకున్నారు. కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో సోమవారం నిర్వహించిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమంలో ప్రజల నుంచి ఇన్‌చార్జ్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మతో పాటు అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్ తదితరులు అర్జీలు స్వీకరించారు. వివిధ సమస్యలపై 460 వినతులు ప్రజల నుంచి అందాయి. కార్యక్రమం అనంతరం అర్జీల పరిష్కారంపై అధికారులతో ఇన్‌చార్జి కలెక్టర్ సమీక్షించారు. అర్జీదారులు సంతృప్తి చెందేలా వారి సమస్యకు నాణ్యమైన పరిష్కారం చూపించాలన్నారు.

వినతుల్లో కొన్ని...

- భూమి సర్వే చేసి హద్దులు చూపించాలంటూ రెవెన్యూ సదస్సులో అర్జీ ఇచ్చినా ఇప్పటికీ సర్వే చేయలేదని గార్లదిన్నె మండలం మర్తాడు గ్రామానికి చెందిన కేశవయ్య ఫిర్యాదు చేశాడు. తగిన చర్యలు తీసుకోవాలని వేడుకున్నాడు.
- తనకు 'అన్నదాత సుఖీభవ' డబ్బు అందలేదని నార్పల మండలం ముచ్చుకుంట గ్రామానికి చెందిన గంగాధర్ విన్నవించాడు. అర్హుల జాబితాలో పేరు ఉన్నా డబ్బు పడలేదని, తగిన చర్యలు తీసుకోవాలని కోరాడు.
- అధికారుల తప్పిదంతో తమకు ప్రభుత్వ పథకాలు అందడం లేదని అనంతపురం రూరల్ మండలం రుద్రంపేటకు చెందిన అరుణమ్మ వాపోయింది. ఎస్ఎస్ఏలో అవుట్‌సోర్సింగ్ అటెండర్‌గా ఉన్న తన భర్త ప్రవీణ్‌కుమార్ 2021లో అనారోగ్యంతో మరణించారని చెప్పింది. సీఎఫ్ఎంఎస్ లాగిన్ నుంచి ఆయన పేరు తొలగించకపోవడంతో 'తల్లికి వందనం' డబ్బు అందలేదని, పింఛను కూడా మంజూరు కాలేదని వాపోయింది. ఎస్ఎస్ఏలో ఉద్యోగం ఇస్తామని చెప్పిన అధికారులు న్యాయం చేయలేదని, తగిన చర్యలు తీసుకోవాలంది.



అర్జీలు స్వీకరిస్తున్న ఇన్‌చార్జ్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ



- నడవలేని స్థితిలో ఉన్న తన బిడ్డ ఓబుళమ్మను చంకనెత్తుకున్న ఈమె పేరు జయమ్మ. కళ్యాణదుర్గం మండలం దుద్దకుంట గ్రామం. ఓబుళమ్మ కనీసం నడవలేని స్థితిలో ఉన్నా.. వీరికి భూమి ఎక్కువగా ఉందంటూ పింఛన్ మంజూరు చేయలేదు. వాస్తవంగా వారికి అంత భూమి లేదు. ఎక్కడో పొరపాటు జరిగిందని,సరిచూడాలని కోరినా అధికారులు పట్టించుకోలేదు. దీంతో సమస్య చెప్పుకునేందుకు బిడ్డతో కలిసి జయమ్మ కలెక్టరేట్‌కు వచ్చింది.

ఇదెక్కడి విచారణ..!

అనంతపురం మెడికల్: సర్వజనాస్పత్రిలో జరుగుతున్న దారుణాలకు ఉన్నతాధికారులు వెన్నుదన్నుగా నిలుస్తున్నారన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఏదైనా విభాగంలో అనుకోని సంఘటన జరిగితే అందుకు సంబంధించి విచారణ బాధ్యతలను ఇతర విభాగాల వైద్యులకు అప్పజెబుతారు. అయితే, ఇక్కడ మాత్రం భిన్నమైన పరిస్థితులు నెలకొన్నాయి. అనారోగ్యంతో బాధపడుతున్న బుక్కరాయసముద్రం మండలం గాంధీనగర్‌కు చెందిన వృద్ధుడు కృష్ణమూర్తి ఆచారిని ఈ నెల 9న కుటుంబీకులు సర్వజనాస్పత్రిలోని ఎంఎం 5 వార్డుకు తీసుకొచ్చారు. వైద్యులు పరీక్షించిన అనంతరం ఆక్సిజన్ లేకుండా స్కానింగ్‌కు పంపడంతో పరిస్థితి విషమించి కృష్ణమూర్తి ఆచారి మృతి చెందాడు. దీనిపై ఈ నెల 10న 'సాక్షి'లో 'ఆక్సిజన్ అందక ఆగిన ఊపిరి' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన డీఎంఈ నరసింహం విచారణ చేపట్టాలని ఆస్పత్రి అధికారులను ఆదేశించారు. అయితే, మెడిసిన్ విభాగంలో వృద్ధుడు మృతి చెందితే, ఈ విషయంపై విచారణకు అదే విభాగాధిపతి అయిన డాక్టర్ భీమసేనాచార్‌కు బాధ్యతలను అప్పగించడం గమనార్హం. ఈ క్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ ఆత్మారాం వ్యవహారం సర్వత్రా విమర్శలకు తావిచ్చింది.

వారి తప్పేం లేదట!

డాక్టర్ భీమసేనాచార్ సోమవారం ఆస్పత్రిలో అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ స్వరూప్, ఇద్దరు పీజీలు, ఎంఎన్‌ఓలను విచారించారు. కృష్ణమూర్తి ఆచారి పక్షవాతం, మరిన్ని సమస్యలతో అడ్మిట్ అయ్యారని, తమకు తెలియకుండానే అతడిని స్కాన్‌కు తీసుకెళ్లారని వైద్యులు తెలియజేయడం గమనార్హం. వాస్తవంగా తన విభాగంలోనే మరణం సంభవించినా ఈ నెల 9న డీపీపీగా ఉన్న డాక్టర్ స్వరూప్ అటువైపు తొంగిచూడలేదు. పీజీలు ఒకరిపై ఒకరు నెపం వేసుకున్నారు. సూపర్ స్పెషాలిటీలో విధులు నిర్వర్తించే ఎంఎన్‌ఓ కొల్లప్ప తనకు సంబంధం లేకున్నా.. వృద్ధుడిని ఆక్సిజన్ లేకుండా తీసుకెళ్లాడు. అందరి నిర్లక్ష్యంతోనే కృష్ణమూర్తి ఆచారి మృతి చెందినట్లు తెలుస్తోంది.

ఒకరికి షోకాజ్, మరొకరికి మెమో

ఎంఎన్‌ఓ కొల్లప్పకు షోకాజ్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ స్వరూప్‌కు మెమో జారీ చేసినట్లు సూపరింటెండెంట్ ఆత్మారాం పేర్కొన్నారు. వివరణకనుగుణంగా తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

దేశభక్తి చాటుదాం

- ఇన్‌చార్జ్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ

అనంతపురం కార్పొరేషన్: 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో పాల్గొని దేశ భక్తిని చాటి చెబుదామని ఇన్‌చార్జ్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ పిలుపునిచ్చారు. సోమవారం అనంతపురంలో నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీని ఇన్‌చార్జ్ కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఆర్‌అండ్‌బీ అతిథి గృహం నుంచి సప్తగిరి సర్కిల్ మీదుగా టవర్‌క్లాక్ వరకు ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 2 నుంచి 15వ తేదీ వరకు దేశ వ్యాప్తంగా 'హర్ ఘర్ తిరంగా' నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తిరంగా యాత్ర, సెల్ఫీలు తదితర కార్యక్రమాల్లో ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు దేశభక్తికి సంబంధించి చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్, జిల్లా పర్యాటక శాఖ అధికారి జయకుమార్, నగరపాలక సంస్థ ఎస్ఈ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



హర్ ఘర్ తిరంగా బైక్ ర్యాలీలో పాల్గొన్న ఇన్‌చార్జ్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ తదితరులు

పకడ్బందీగా పంద్రాగస్టు ఏర్పాట్లు

అనంతపురం అర్బన్: పోలీసు పరేడ్ మైదానంలో స్వాతంత్య్ర దినోత్సవ ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని ఇన్‌చార్జ్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ రెవెన్యూ భవన్‌లో అధికారులతో ఆయన సమీక్షించారు. ఏర్పాట్లలో పొరపాట్లకు తావివ్వకూడదన్నారు. ప్రొటోకాల్ ప్రక్రియను అనంతపురం ఆర్డీఓ, సీటింగ్, ఇతర ఏర్పాట్లను తహసీల్దారు చూడాలని ఆదేశించారు. సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణను డీఈఓ, డీఆర్‌డీఏ పీడీ చూడాలన్నారు. పథకాలకు సంబంధించి 14 స్టాళ్లు ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సురేష్, హౌసింగ్ పీడీ శైలజ, డీటీసీ వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మాతాశిశు మరణాలకు తావివ్వకండి



మాతాశిశు మరణాలపై సమీక్షిస్తున్న ఇన్‌చార్జ్ కలెక్టర్ శివ్‌నారాయణ్ శర్మ

అనంతపురం అర్బన్: మాతాశిశు మరణాలకు తావివ్వరాదని సంబంధిత అధికారులను ఇన్‌చార్జ్ కలెక్టర్ శివ్‌నారాయణ్ శర్మ ఆదేశించారు. మాతాశిశు మరణాల అంశంపై కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో వైద్య, ఆరోగ్యశాఖ అధికారులతో సోమవారం ఆయన సమీక్షించారు. ఈ త్రైమాసికంలో జిల్లాలో చోటు చేసుకున్న నాలుగు మాతృ మరణాలకు కారణాలను అడిగి తెలుసుకున్నారు. కూడేరు, నాగసముద్రం, విడపనకల్లు, అంబేడ్కర్ నగర్ పీహెచ్‌సీలో జరిగిన మాతృ మరణాలపై ఆయా ప్రాంతాల ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తల నుంచి వివరణ తీసుకున్నారు. మరణానికి ముందు ఎలాంటి ఇబ్బందులు ఎదురయ్యాయి, మరణానికి కారణాలు తెలుసుకోవాలన్నారు. మరోసారి అలాంటి కారణాలతో ఇంకో మరణం జరగకుండా వైద్యులు, సిబ్బంది తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మాతృ మరణాల నివారణకు పర్యవేక్షక సిబ్బంది సరైన చర్యలు తీసుకోవాలన్నారు. రక్తహీనత, గుండె సంబంధిత సమస్యలు, బరువు, ఎత్తు తక్కువ, తల్లి గర్భంలో ఉమ్మనీరు తక్కువగా ఉన్నా, బిడ్డ పెరుగుదల లేకపోయినా, హైరిస్క్ గర్భిణులను గుర్తించి ప్రత్యేక వైద్యసేవలు అందించాలని ఆదేశించారు. శిశు మరణాల విషయంలోనూ జాగ్రత్తలు పాటించాలన్నారు. సమావేశంలో డీఎంహెచ్ఓ ఈబీదేవి, వ్యాధి నిరోధక టీకాల అధికారి యుగంధర్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

పశుశాఖ ఇన్‌చార్జి జేడీగా డాక్టర్ సుధాకర్



అనంతపురం అగ్రికల్చర్: పశుసంవర్ధకశాఖ ఇన్‌చార్జి జేడీగా మరోసారి డాక్టర్ టీవీ సుధాకర్‌ను నియమిస్తూ ఆ శాఖ డైరెక్టరేట్ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఏడాది జూన్ 30న ఉద్యోగ విరమణ చేసిన డాక్టర్ జీపీ వెంకటస్వామి స్థానంలో అప్పటి డీఎల్‌డీఏ ఈఓగా ఉన్న సుధాకర్‌కు ఎఫ్ఏసీ జేడీగా బాధ్యతలు అప్పగించారు. ఫారిన్ సర్వీసు కింద పనిచేస్తున్న డీఎల్‌డీఏ ఈఓ పోస్టు గడువు జూలై 15తో ముగిసింది. దీంతో ఆయన సెలవులో వెళ్లి వారం రోజుల తర్వాత పశుశాఖలో ఉరవకొండ డీడీ పోస్టింగ్ తెచ్చుకున్నారు. ఇటీవల అనంతపురం డీడీగా ఉన్న డాక్టర్ వై.రమేష్‌రెడ్డిని ఇన్‌చార్జ్ జేడీగా నియమిస్తూ ఆ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. కానీ కొన్ని కారణాల వల్ల ఇన్‌చార్జ్ పోస్టు నిర్వర్తించలేనంటూ రమేష్‌రెడ్డి విన్నవించారు. ఈ క్రమంలో మరోసారి డాక్టర్ టీవీ సుధాకర్‌కు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. బుధవారం ఆయన బాధ్యతలు చేపట్టనున్నట్లు సమాచారం.

జేబుకు అధనపు చిల్లు

- గ్యాస్ ఏజెన్సీ డెలివరీ బాయ్‌ల నిర్వాకం
- సిలిండర్ ధరపై అదనంగా రూ.30 వసూలు
- జిల్లాలో రోజు వారీగా 12 వేల సిలిండర్ల డెలివరీ
- అదనంగా రూ.30తో రోజువారీ వసూలు రూ.3.60 లక్షలు
- నెలసరి అదనపు వసూళ్లు రూ.1.08 కోట్లు

అనంతపురంలోని హౌసింగ్ బోర్డు ఎక్స్‌టెన్షన్‌లో నివాసముంటున్న విజయకుమార్ వంట గ్యాస్ సిలిండర్ బుక్ చేశారు. సిలిండర్ ధర రూ.920 కాగా, డెలివరీ బాయ్‌కు రూ.1,000 ఇస్తే చిల్లర ఇవ్వలేదు. ఎప్పుడూ అదనంగా రూ.30 కదా తీసుకునేది ఇప్పుడేంది రూ.80 తీసుకుంటున్నావు అని ప్రశ్నించాడు. ఇద్దామంటే చిల్లర లేదు అని బాయ్ చెప్పాడు. అయితే ఫోన్ పే చేస్తా.. ఆ డబ్బు వెనక్కి ఇవ్వు అని విజయకుమార్ అనడంతో బాయ్ మారుమాట్లాడకుండా రూ.50 వెనక్కి ఇచ్చాడు. అప్పటికే అదనంగా రూ.30 తీసుకున్న బాయ్ చిల్లర లేదనే సాకుతో మరో రూ.50 నొక్కేందుకు సిద్ధపడ్డాడు. సిలిండర్ డెలివరీ క్రమంలో దాదాపు అందరు వినియోగదారుల పరిస్థితి ఇలాగే ఉంటోంది.

అనంతపురం అర్బన్: 'వంట గ్యాస్ సిలిండర్ డెలివరీ క్రమంలో నిర్ణీత ధరకు మించి అదనంగా డబ్బు వసూలు చేయడం నేరం. అలా వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం' అంటూ గ్యాస్ ఏజెన్సీలను జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్ శర్మ పలుమార్లు హెచ్చరిస్తూ ప్రకటనలు జారీ చేసినా ఏజెన్సీ యాజమాన్యంలో కానీ డెలివరీ బాయ్స్‌లో కానీ మార్పు రావడం లేదు. సిలిండర్ డెలివరీ చేసే క్రమంలో వినియోగదారుల నుంచి నికర ధరపై అదనంగా రూ.30 ఖరాఖండీగా వసూలు చేస్తున్నారు. కొందరైతే ఏకంగా రూ.50 కూడా వసూలు చేస్తున్నారు. ఒక్కొక్క సిలిండర్‌పై అదనంగా రూ.30 అనేది చూసేందుకు చిన్న మొత్తంగా కనిపిస్తుంది. అయితే జిల్లావ్యాప్తంగా రోజువారీగా డెలివరీ అవుతున్న సిలిండర్లపై అదనపు వసూలు మొత్తం లెక్కగడితే ఆశ్చర్యపోక తప్పదు. జిల్లా వ్యాప్తంగా 50 గ్యాస్ ఏజెన్సీలు ఉన్నాయి. వీటి పరిధిలో 7,65,246 గృహావసర వంట గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. వినియోగదారులకు రోజువారీగా జిల్లా వ్యాప్తంగా దాదాపు 12 వేల సిలిండర్లు డెలివరీ అవుతుంటాయి. ఈ లెక్కన నెలకు 3.60 లక్షల గ్యాస్ సిలిండర్లను వినియోదారులకు డెలివరీ చేస్తుంటారు. ఒక్కొక్క సిలిండర్ నుంచి రూ.30 చొప్పున అదనంగా తీసుకున్నా.. నెలకు రూ.1.08 కోట్లు అక్రమార్జనకు పాల్పడుతున్నట్లుగా తెలుస్తోంది. గృహావసర వంట గ్యాస్ సిలిండర్ ధర ప్రస్తుతం రూ.920 ఉంది. అయితే సిలిండర్ నికర ధరతో సంబంధం లేకుండా ఒక్కొక్క సిలిండర్ బిల్‌పై వినియోగదారుల నుంచి డెలివరీ బాయ్స్ రూ.30 అదనంగా వసూలు చేస్తున్నారు. కొందరి వద్ద నుంచి ఏకంగా రూ.50 వరకు వసూలు చేస్తున్న సందర్భాలూ ఉన్నాయి.

అదనం ఇవ్వకపోతే తిప్పలే

సిలిండర్ ధరపై బాయ్స్‌కు అదనపు సొమ్ము రూ.30 ఇవ్వకపోతే వినియోదారులకు తిప్పలు తప్పవు. సిలిండర్ మంజూరైనా డెలివరీ చేయరు. డోర్ లాక్ అని చెప్పి ఏజెన్సీలో సిలిండర్‌ను వెనక్కి ఇచ్చేస్తుంటారు. ఇలా చేయడం వల్ల సిలిండర్ బుకింగ్ రద్దవుతుంది. దీంతో మరోమారు వినియోదారుడు బుక్ చేయాలి. ఇలా రెండు మూడు దఫాలు ఇబ్బందికి గురిచేస్తారు. దీంతో ఈ తిప్పలు పడలేక వినియోదారులు తప్పని పరిస్థితిలో సిలిండర్‌పై అదనపు మొత్తాన్ని ఇచ్చుకుంటారు. అలాంటి పరిస్థితిని డెలివరీ బాయిస్ కల్పిస్తుండడం గమనార్హం.



జిల్లాలో దీపం పథకం కనెక్షన్లు	2,14,970
పీఎం ఉజ్వల యోజన కనెక్షన్లు	30,355
సీఎస్ఆర్ కనెక్షన్లు	37,257
సాధారణ కనెక్షన్లు	4,82,664
మొత్తం కనెక్షన్లు	7,65,246
రోజు వారీ సిలిండర్ల డెలివరీ	12,000
నెలసరి సిలిండర్ల డెలివరీ	3.60 లక్షలు

వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురి ఆత్మహత్య

జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురు వ్యక్తులు ఆత్మహత్య చేసుకున్నారు. భార్య మృతిని జీర్ణించుకోలేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకోగా, అప్పులు తీర్చే మార్గం కానరాక వ్యవసాయ కూలీ బలవన్మరణానికి పాల్పడ్డాడు. వివరాలు...

రాప్తాడు రూరల్: అనంతపురం రూరల్ మండలం చియ్యేడు గ్రామానికి చెందిన తిమ్మన్నగారి రాజశేఖర్ (36) ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయనకు భార్య రాజేశ్వరి, ముగ్గురు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు. వ్యవసాయ కూలి పనులతో జీవనం సాగించేవారు. ఈ క్రమంల కుటుంబ పోషణ కోసం ప్రైవేట్ వ్యక్తుల వద్ద చేసిన అప్పులకు వడ్డీలు పెరిగి తడిసి మోపడైంది. డ్వాక్రా సంఘంలో రాజేశ్వరి తీసుకున్న రుణానికి సంబంధించి కంతులు చెల్లించలేని ఇబ్బంది పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో అప్పులు ఎలా తీర్చాలో అర్థం కావడం లేదంటూ మదనపడేవాడు. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం డ్వాక్రా డబ్బులు చెల్లించే విషయంలో దంపతుల మధ్య గొడవ జరిగింది. అనంతరం డ్వాక్రా సమావేశానికి రాజేశ్వరి వెళ్లింది. ఇంట్లో ఎవరూ లేని ఆ సమయంలో రాజశేఖర్ ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. డ్వాక్రా సమావేశం ముగిసిన తర్వాత ఇంటికి వచ్చిన భార్య... తలుపు తట్టినా ఎంతసేపటికీ తీయకపోవడంతో అనుమానం వచ్చి బంధువులు, చుట్టుపక్కల వారికి తెలపడంతో వారొచ్చి బలవంతంగా తలుపు తీసి లోపలకు ప్రవేశించారు. అప్పటికే విగతజీవిగా ఉరికి వేలాడుతున్న రాజశేఖర్‌ను గమనించి హుటాహుటిన అనంతపురంలోని జీజీహెచ్‌కు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై ఇటుకల పల్లి పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

పురుగుల మందు తాగి..

పెద్దవడుగూరు: మండంలోని కాశేపల్లి గ్రామానికి చెందిన హనుమంతరెడ్డి(48) ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయనకు భార్య, ఓ కుమారుడు ఉన్నారు. సోమవారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లిన హనుమంతరెడ్డి సాయంత్రమైనా ఇంటికి చేరుకోలేదు. దీంతో కుటుంబసభ్యులు గాలింపు చేపట్టారు. ఈ లోపు 44వ జాతీయ రహదారిపై టోల్‌ప్లాజా సమీపంలోని పొలంలో విగతజీవిగా పడి ఉన్న హనుమంతరెడ్డిని గుర్తించిన స్థానికుల సమాచారంతో కుటుంబసభ్యులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లుగా గుర్తించి, సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు. కాగా, ఆయన మృతికి కారణాలు తెలియాల్సి ఉంది.

ఒంటరితనాన్ని తాళలేక..

బ్రహ్మసముద్రం : మండలంలోని కన్నేపల్లి గ్రామానికి చెందిన హరిజన హనుమంతు (42) ఆత్మహత్య చేసుకున్నాడు. మూడేళ్ల క్రితం ఆయన భార్య మృతి చెందింది. అప్పటి నుంచి మనోవేదనకు లోనైన ఆయన ఆదివారం రాత్రి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

బెల్ట్, పర్మిట్ షాపులను రద్దు చేయాలి

- వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం డిమాండ్



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం నాయకులు

అనంతపురం కార్పొరేషన్: బెల్ట్, పర్మిట్ షాపులను రద్దు చేయకపోతే ఆందోళనలు చేపడతామని ప్రభుత్వాన్ని వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కృష్ణవేణి హెచ్చరించారు. జిల్లా వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఎక్కడైనా సంక్షేమాన్ని అందించే ప్రభుత్వాలు ఉంటాయి కానీ, రాష్ట్రంలో మాత్రం మద్యం బాగా తాగండి.. ఊగండి, జీవితాలను నాశనం చేసుకోండి అనే విధంగా ప్రభుత్వ వైఖరి ఉందని ధ్వజమెత్తారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 43 వేల బెల్టు షాపులను రద్దు చేసి ఎందరో జీవితాల్లో వెలుగులు నింపారని గుర్తు చేశారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణానికి సంబంధించి పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్‌లలో మాత్రమే అనుమతిస్తున్నట్లుగా ప్రకటించి సీఎం చంద్రబాబు తన కుటిల బుద్ధిని బయట పెట్టుకున్నారని మండిపడ్డారు. రానున్న రోజుల్లో ఈ ప్రభుత్వానికి బుద్ధి చెబుతామన్నారు. సమావేశంలో పార్టీ మహిళా విభాగం నాయకురాళ్లు శోభారాణి, భారతి, ప్రసన్న, మహేశ్వరి, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాల కల్పన పేరుతో టోకరా

గార్లదిన్నె: ఆర్మీ, రైల్వే శాఖలో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ నమ్మించి నిరుద్యోగులను మోసం చేసిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన మేరకు.. గార్లదిన్నె మండలం కనుంపల్లికి చెందిన సుధాకర్, రవిరాజా ఇద్దరూ అన్నదమ్ములు. 10 ఏళ్ల క్రితం గ్రామ సమీపంలోనే 44వ జాతీయ రహదారి పక్కన ఆర్మీ కోచింగ్ సెంటర్ ఏర్పాటు చేశారు. కోచింగ్‌కు వచ్చిన నిరుద్యోగులకు ఆర్మీతో పాటు రైల్వే శాఖలో ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మించారు. దీంతో ఏడేళ్ల క్రితం గార్లదిన్నెకు చెందిన రవితేజ రూ.3 లక్షలు చెల్లించాడు. 2024లో శ్రీసత్యసాయి జిల్లా బత్తలపల్లి మండలం కట్టకిందపల్లికి చెందిన రామాంజనేయులు కూడా రైల్వేలో టెక్నీషియన్ ఉద్యోగం కోసం రూ.4లక్షలు ఫోన్‌పే ద్వారా చెల్లించి, మిగిలిన రూ.6లక్షలను నగదు రూపంలో చెల్లించాడు. కేంద్ర ప్రభుత్వం అగ్నిపథ్ కార్యాచరణను అమలు చేసిన తర్వాత ఆర్మీ కోచింగ్ సెంటర్‌ను మూసివేశారు. ఈ క్రమంలో డబ్బులు చెల్లించిన ఇద్దరు నిరుద్యోగులు తమకు ఉద్యోగాలు ఎప్పుడు ఇప్పిస్తారని సుధాకర్, రవిరాజాకు తరచూ అడుగుతున్నా ఫలితం లేకపోయింది. దీంతో అనుమానం వచ్చిన వారు తాము కట్టిన

'సుఖీభవ' రాలేదు సారూ!

- జేడీఏ ఆఫీసుకు రైతుల క్యూ

అనంతపురం అగ్రికల్చర్: 'పీఎం కిసాన్-అన్నదాత సుఖీభవ' పథకం లబ్ధి చేకూరలేదంటూ సోమవారం జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయానికి రైతులు క్యూ కట్టారు. ఈ-కేవైసీ, ఎన్‌పీసీఐ చేయించినా తమకు రాలేదని చాలా మంది రైతులు చెప్పడం గమనార్హం. అధికారులేమో.. ప్రాసెస్‌లో ఉందని త్వరలోనే డబ్బు జమ అవుతుందని రైతులకు నచ్చజెప్పి పంపారు.

రూ.400 కోట్లకు పైగా ఎగ్గొట్టి..

గత ప్రభుత్వ హయాంలో క్రమం తప్పకుండా జూన్, అక్టోబర్, జనవరిలో పెట్టుబడి సాయం అందించారు. సీఎం చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం మాత్రం మొదటి ఏడాది రూ.400 కోట్లకు పైగా ఎగ్గొట్టి ఈ ఏడాది పథకం అమలు చేసింది. అందులోనూ గత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ జాబితాతో పోల్చితే 19 వేల మంది రైతులకు రిక్తహస్తం చూపించింది. మిగిలిన రైతులకైనా సరిగా డబ్బు చేశారా అంటే అదీ లేదు. జాబితా ప్రకారం రాష్ట్రంలో 2.75 లక్షల మంది రైతుల ఖాతాల్లోకి పూర్తి స్థాయిలో సొమ్ము జమ కావడం లేదని చెబుతున్నారు. జిల్లా వ్యాప్తంగా డబ్బులు పడని రైతులు 6 వేల నుంచి 8 వేల మంది వరకూ ఉన్నట్లు తెలిసింది.

వృద్ధుడి అనుమానాస్పద మృతి

గుమ్మఘట్ట: మండలంలోని గోనబావి గ్రామానికి చెందిన వడ్డే పాపన్న(80) కర్ణాటకలోని మొలకాల్మూరులో అనుమానాస్పద స్థితి మృతి చెంది కనిపించాడు. ఆయనకు భార్య భీమక్క, నలుగురు కుమారులు, నలుగురు కుమార్తెలు ఉన్నారు. మొలకాల్మూరుకు వెళుతున్నట్లుగా సోమవారం ఉదయం ఇంట్లో చెప్పి బయలుదేరిన వ్యక్తి ... మధ్యాహ్నానికే అక్కడి ఓ లాడ్జిలో మృతిచెందినట్లుగా సమాచారం అందడంతో కుటుంబసభ్యులు తరలి వెళ్లారు. ఆయన మృతిపై అనుమానాలు వ్యక్తం చేస్తూ ఫిర్యాదు చేయడంతో ఆ దిశగా కర్ణాటక పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

గురుకులంలో మిగులు సీట్ల భర్తీకి 16న పరీక్ష

గార్లదిన్నె: స్థానిక ముస్లిం మైనారిటీ గురుకుల పాఠశాలలో మిగులు సీట్ల భర్తీకి ఈ నెల 16న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ ఆంజనేయులు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి 5వ తరగతిలో 25, 6వ తరగతిలో 2, 7వ తరగతిలో 2, 8వ తరగతిలో 2 మిగులు సీట్ల భర్తీకి నోటిఫికేషన్ జారీ కాగా, ఆసక్తి ఉన్న ముస్లిం మైనార్టీలు, ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల నుంచి ఈ నెల 14వ తేదీ లోపు దరఖాస్తులు స్వీకరిస్తారు. వీరికి ఈ నెల 16న ఉదయం 10 గంటలకు ప్రవేవపరీక్ష నిర్వహించి, మెరిట్ ఆధారంగా సీట్లు కేటాయిస్తారు. ముస్లిం మైనార్టీ విద్యార్థులకు ప్రవేశ పరీక్ష ఉండదు. పూర్తి వివరాలకు గార్లదిన్నెలోని పెనకచెర్ల డ్యాం రోడ్డులో ఉన్న ముస్లిం మైనారిటీ గురుకుల పాఠశాలలో సంప్రదించవచ్చు.

అత్యాచారం కేసులో నిందితుడి అరెస్ట్


గుత్తి: మహిళపై అత్యాచారానికి పాల్పడిన వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. వివరాలను సోమవారం వెల్లడించారు. పుట్లూరు మండలం కడవకల్లుకు చెందిన గంగాధర్.. గుత్తి ఆర్ఎస్‌కు చెందిన ఓ మహిళతో పెంచుకున్న పరిచయం ప్రేమగా మారింది. ఈ నెల 7న గుత్తి ఆర్ఎస్‌కు చేరుకున్న గంగాధర్.. ఆమెకు మాయమాటలు చెప్పి నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లారు. అక్కడ అత్యాచారానికి పాల్పడ్డాడు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఘటనపై విచారణ అనంతరం గంగాధర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సురేష్ తెలిపారు. పక్కా ఆధారాలతో సోమవారం రాత్రి నిందితుడిని అరెస్ట్ చేసినట్లు వివరించారు.

ప్రిన్సిపాల్‌గా ఔట్ సోర్సింగ్ ఉద్యోగి!

- గిరిజన గురుకులంలో వింత పోకడ
- బాధ్యతలు అప్పగించిన గిరిజన సంక్షేమ శాఖ అధికారి

ఉరవకొండ: గిరిజన సంక్షేమ శాఖ అధికారులు వింత పోకడలకు తావిస్తూ గురుకుల పాఠశాలల్లో నిబంధనలు తుంగలో తొక్కుతున్నారు. వజ్రకరూరు మండలం రాగులపాడులోని ప్రభుత్వ గిరిజన బాలుర గురకుల పాఠశాలనే ఇందుకు నిదర్శనం. ఈ పాఠశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖర్‌బాబు ఇటీవల మెడికల్ లీవ్‌లోకి వెళ్లారు. ఆ స్థానంలో ఇన్‌చార్జ్‌గా సమీప గురుకులానికి చెందిన ప్రిన్సిపాల్‌కు లేదా అదే పాఠశాలలోని రెగ్యులర్ సీనియర్ ఉపాధ్యాయుడికి అప్పగించాల్సి ఉంది. నిబంధనలు కూడా ఇదే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. అయితే ఇందుకు విరుద్ధంగా ఆ పాఠశాలలో ఔట్‌సోర్సింగ్ కింద తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న బాల్యానాయక్‌కు అప్పగించడం గమనార్హం. ఇలాంటి పరిస్థితుల్లో పాలనా పరమైన ఇబ్బందులు తలెత్తినా.. గురుకులంలో విద్యార్థులకు ఏదైనా జరగరానిది జరిగినా బాధ్యత ఎవరు వహిస్తారనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. దీనిపై జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి శ్రీనివాసరావును వివరణ కోరగా.. రెగ్యులర్ ఉద్యోగులు దొరకడం లేదని, వారం రోజుల్లో రెగ్యులర్ ఉద్యోగికి ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు అప్పగించేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

డ్రైనేజీలో పడి చేనేత కార్మికుడి మృతి



కాలువలో పడి మృతిచెందిన నాగరాజు

ధర్మవరం: పట్టణంలోని శ్రీదేవి థియేటర్ వద్దనున్న డ్రైనేజీలో పడి ఓ చేనేత కార్మికుడు మృతిచెందాడు. వన్‌టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్ తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని పేట బసవన్న కట్టవీధికి చెందిన సపారు నాగరాజు(60) పట్టుచీరలను మడతలు వేసేందుకు వెళుతుంటాడు. ఐదేళ్ల క్రితం భార్య మృతి చెందింది. అప్పటి నుంచి మద్యానికి అలవాటుపడ్డాడు. ఆదివారం రాత్రి మద్యం సేవించి శ్రీదేవి థియేటర్ సమీపంలో గ్రంథాలయం ఎదురుగా మురుగు కాలువలో పడిపోయాడు. రాత్రి వర్షం ఎక్కువగా రావడంతో కాలువలో నీటి ప్రవాహం ఎక్కువైంది. సోమవారం ఉదయం పారిశుద్ధ్య కార్మికులు కాలువను శుభ్రం చేస్తుండగా మృతదేహం కనిపించడంతో బయటకు తీశారు. స్థానికులు గుర్తించి మృతుని కుమారుడు మనోహర్‌కు సమాచారం అందించారు. కుమారుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహానికి స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు.

నేడు విద్యుత్ అదాలత్

అనంతపురం టౌన్: విద్యుత్ సమస్యలు పరిష్కరించేందుకు మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు అనంతపురంలోని పాతూరులో ఉన్న విద్యుత్ కార్యాలయ ఆవరణలో విద్యుత్ అదాలత్ నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆ శాఖ ఈఈ జేవీ రమేష్ సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. అనంతపురం డివిజన్ పరిధిలోని గార్లదిన్నె, బుక్కరాయసముద్రం, అనంతపురం, కూడేరు, ఆత్మకూరు, నార్పల, శింగనమల మండలాల్లోని రైతులు, విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలను విన్నవించి, పరిష్కరించుకోవచ్చు.

7 లారీల బియ్యం స్వాధీనం



రేషన్ బియ్యాన్ని లారీలో లోడ్ చేస్తున్న దృశ్యం

యాడికి: అక్రమంగా రైస్ మిల్లులో నిల్వ చేసిన టన్నుల కొద్దీ రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుంటున్నట్లు యాడికి తహసీల్దార్ ప్రతాపరెడ్డి, సీఐ ఈరన్న తెలిపారు. వివరాలను సోమవారం వారు వెల్లడించారు. యాడికిలోని పెద్దపేటకు పోతున్న మార్గంలో ఉన్న బలరాముడు రైస్ మిల్లులో రేషన్ బియ్యం నిల్వలు ఉన్నట్లుగా తెలుసుకున్న అధికారులు సోమవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. టన్నుల కొద్దీ రేషన్ బియ్యాన్ని గుర్తించిన అధికారులు వెంటనే విషయాన్ని తాడిపత్రి ఏఎస్పీ రోహిత్‌కుమార్ చౌదరి దృష్టికి తీసుకెళ్లి భద్రత కల్పించాలని కోరారు. దీంతో ఆయన ఆగమేఘాలపై అక్కడకు చేరుకున్నారు. 50 కిలోల చొప్పున ఒక్కో బస్తాలో నింపి ఒక్కో లారీలో 30 నుంచి 32 టన్నుల వరకు హమాలీల ద్వారా లోడ్ చేయించారు. మొత్తం ఏడు లారీల్లో 215 టన్నుల రేషన్ బియ్యాన్ని గుంతకల్లులోని స్టాక్ పాయింట్‌కు తరలించినా... ఇంకా మిగులు ఉంది. ఈ బియ్యాన్ని కూడా స్టాక్ పాయింట్‌కు తరలించనున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఐ ఎం.రమణయ్య, డీటీ శ్రీనివాసులు, సీఎస్‌డీటీ మల్లేసు, వీఆర్‌ఓలు, సచివాలయ సిబ్బంది, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

ఐదుగురిని కరిచిన పిచ్చికుక్క

ఉరవకొండ: స్థానిక కవితా హోటల్ సర్కిల్ వద్ద ఓ పిచ్చికుక్క స్వైరవిహారం చేస్తూ ఐదుగురిని కరిచి గాయపరిచింది. గాయపడిన వారిలో పొట్టిపాడు గ్రామానికి చెందిన రాము, చిన్నముష్టూరుకు చెందిన ఓబులేసు, నారాయణ, హోతూరు నివాసి రామాంజినేయులు, ఉరవకొండ పట్టణానికి చెందిన రాము ఉన్నారు. వీరంతా స్థానిక ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందారు.

రెవెన్యూ ఉద్యోగులకు రక్షణ కల్పించండి

- ఏపీఆర్ఎస్ఏ జిల్లా అధ్యక్షుడు ఆర్ఎన్ దివాకర్

గార్లదిన్నె: విధి నిర్వహణలో ఉన్న రెవెన్యూ ఉద్యోగులపై దాడులు జరుగకుండా రక్షణ కల్పించాలని ఏపీఆర్ఎస్ఏ జిల్లా అధ్యక్షుడు ఆర్ఎన్ దివాకర్ కోరారు. గార్లదిన్నె మండలం కల్లూరులో రెవెన్యూ అధికారులపై టీడీపీ గుండాలు సాగించిన దాడిని ఖండిస్తూ మండలంలోని వివిధ గ్రామాల వీఆర్ఓలు, వీఆర్ఏలు సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆర్ఎన్‌దివాకర్, వీఆర్ఓల సంఘం అధ్యక్షుడు రామకృష్ణ, వీఆర్ఏల సంఘం అధ్యక్షుడు ఓబులేసు మాట్లాడారు. ఈ నెల 7న రాత్రి సమయంలో కల్లూరులోని కొండకింద కొట్టాల వద్ద ఉన్న సింగరప్ప కొండ సమీపంలో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఎర్ర మట్టి తవ్వకాలు చేపట్టి రవాణా సాగిస్తున్నట్లుగా తెలుసుకున్న ఆర్డీఓ కేశవనాయుడు ఆదేశాల మేరకు వీఆర్ఓ రవికాంత్, వీఆర్ఏ నాగరాజుతో కలసి అక్కడకు చేరుకుని పరిశీలించారు. మట్టి తరలిస్తున్న వాహనాలను అడ్డుకుని తాళాలు తీసుకున్నారు. ఆ సమయంలో టీడీపీ గుండాలు రెచ్చిపోయి దాడులకు దిగడం ఎంత వరకు సబబు అని ప్రశ్నించారు. దాడికి పాల్పడిన వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా భద్రత కల్పించాలంటూ వినతి పత్రాన్ని డిప్యూటీ తహసీల్దార్ మల్లికార్జునకు అందజేశారు.

స్టాప్‌లో బస్సు ఆపలేదని గొడవ



ప్రయాణికురాలితో వాగ్వాదం చేస్తున్న బస్సు డ్రైవర్

కళ్యాణదుర్గం/అనంతపురం క్రైం: చెయ్యెత్తినా.. బస్సు ఆపకుండా వెళ్లిపోవడంతో డ్రైవర్‌తో ఓ ప్రైవేట్ ఉద్యోగిని గొడవ పడింది. మూడు రోజుల క్రితం చోటు చేసుకున్న ఈ ఘటన సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో వెలుగులోకి వచ్చింది. వివరాలు.. సుచరిత అనే ప్రైవేట్ ఉద్యోగిని అనంతపురం నుంచి కళ్యాణదుర్గం వచ్చేందుకు సిద్ధమై అనంతపురం నడిమి వంక బస్టాఫ్ వద్ద వేచి ఉండగా ఆర్టీసీ అద్దె బస్సు అటుగా వచ్చింది. ఆమె చెయ్యెత్తినా డ్రైవర్ ఆపకుండా నిర్లక్ష్యంగా ముందుకు వెళ్లిపోయాడు. అత్యవసరం కావడంతో సదరు మహిళ కుమారుడి సహకారంతో ద్విచక్ర వాహనంపై బస్సును అనుసరిస్తూ ఓవర్‌టేక్ చేసి ఆపి ఎక్కింది. చెయ్యెత్తినా బస్సు ఎందుకు ఆపలేదంటూ డ్రైవర్‌ను నిలదీయడంతో అతను నిర్లక్ష్యంగా సమాధానమిచ్చాడు. దీంతో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుని పరిస్థితి విషమించింది. చివరకు ప్రయాణికులు జోక్యం చేసుకోవడంతో వివాదం సద్దుమణిగింది.ఈ అంశాన్ని చిత్రీకరించిన ప్రయాణికుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేయడంతో ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్ నిర్వాకం వెలుగు చూసింది. తరచూ ఇలాంటి ఘటనలు జరుగుతున్నా ఆర్టీసీ అధికారులు పట్టించుకోవడం లేదని నెటిజన్లు మండిపడ్డారు.

ఐ కేర్ సెంటర్‌పై దాడి కేసులో ఐదుగురి అరెస్ట్

అనంతపురం: ఈ నెల 9న అనంతపురంలోని అస్రా ఐ కేర్ సెంటర్‌పై దాడి చేసిన ఐదుగురిని అరెస్ట్ చేసినట్లు రెండో పట్టణ సీఐ శ్రీకాంత్ యాదవ్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన వివరాలు వెల్లడించారు. పట్టుబడిన వారిలో శ్రీసత్యసాయి జిల్లా రామగిరి మండలం కుంటిమద్ది గ్రామానికి చెందిన శ్రీశైలం శివశంకర్, పాపిరెడ్డిపల్లికి చెందిన మురికి పృథ్వీ, రామగిరికి చెందిన ఆది ఆంధ్ర మారుతి, చెన్నేకొత్తపల్లి మండలం నాగసముద్రం నివాసి గండ్లూరి వెంకటరమణ, అనంతపురంలోని బుడ్డప్ప నగర్‌కు చెందిన బండారు అనిల్ కుమార్ ఉన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి, న్యాయస్థానంలో హాజరు పరిచినట్లు పోలీసులు తెలిపారు.

క్లుప్తంగా

సుమయ, షరీఫ్‌పై చర్యలు తీసుకోండి



ర్యాలీగా వెళ్తున్న నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: అధిక వడ్డీలకు అప్పులు ఇస్తూ ఆస్తులను కబ్జా చేస్తున్న సుమయ, షరీఫ్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం నగరంలో అంబేడ్కర్ విగ్రహం నుంచి ఎస్పీ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. బాధితులకు న్యాయం జరిగే దాకా అండగా ఉంటామని స్పష్టం చేశారు. సాయినగర్ 5వ క్రాస్‌లో అస్రా కంటి ఆస్పత్రి భవనం విషయంలో తాకట్టు కోసం తమకు డబ్బులు ఇచ్చి ఆస్తి తమదేనంటూ సుమయ, షరీఫ్ దంపతులు రాజకీయం చేస్తున్నారని బాధితురాలు భారతి వాపోయారు.

పుస్తకం.. జీవన నేస్తం



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎస్కేయూ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ బి.అనిత

అనంతపురం: పుస్తకం.. జీవన నేస్తంగా దోహదపడుతుందని శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ బి.అనిత పేర్కొన్నారు. ఎస్కేయూలోని వీసీ చాంబర్‌లో సోమవారం న్యాయశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ ఎం.శ్రీరాములు పర్యవేక్షణలో డాక్టర్ బి.వెంకటేశ్వర్లు రచించిన 'భారతదేశంలో భూ సేకరణ–ప్రధానంగా ఆంధ్రప్రదేశ్‌లోని భూ యజమానులకు నష్టపరిహారం చెల్లించడం' శీర్షికతో రచించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ.. రీసెర్చ్ స్కాలర్లు పుస్తక రచనపై దృష్టి సారించాలని కోరారు. పుస్తక రచనా నైపుణ్యాలను పెంపొందించుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు డాక్టర్ ఎంవీ శ్రీనివాసన్, డాక్టర్ భాస్కర్ రెడ్డి, డాక్టర్ తిమ్మయ్య, డాక్టర్ శివశంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

74 పిటీషన్ల స్వీకరణ



సమస్య తెలుసుకుంటున్న ఎస్పీ జగదీష్

అనంతపురం: ఫిర్యాదులను ప్రాధాన్యతగా గుర్తించి సకాలంలో పరిష్కారం చూపాలని ఎస్పీ జగదీష్ పేర్కొన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో 74 పిటీషన్లు స్వీకరించారు. ప్రజల సమస్యలకు త్వరితగతిన నాణ్యతగా పరిష్కారం చూపాలని కోరారు. అనంతరం సంబంధిత పోలీసు అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. కార్యక్రమంలో మహిళా డీఎస్పీ ఎస్.మహబూబ్ బాషా పాల్గొన్నారు.

మద్యం షాపులు, బార్లపై నిరంతర నిఘా



సూచనలిస్తున్న ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య

అనంతపురం: నగరంలోని మద్యం షాపులు, బార్లపై నిరంతరం నిఘా పెట్టాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ పి.నాగమద్దయ్య తెలిపారు. సోమవారం అనంతపురం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. నవోదయం 2.0 అమలు పరిస్థితిని సమీక్షించారు. గంజాయి, నేరాల పరిస్థితిని పరిశీలించారు. రాబోయే బార్ పాలసీ అమలు దృష్ట్యా అనంతపురం నగరంలోని బార్లకు సంబంధించిన కార్యాచరణ ప్రణాళికపై ఆరా తీశారు. డ్రగ్స్ సరఫరా చేస్తున్న వారిని పట్టుకునేలా సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) శ్రీరామ్, అనంతపురం ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, ఎస్‌ఐలు జయ నరసింహ, జాకీర్ హుస్సేన్, కృష్ణా రెడ్డి, స్టేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సెక్టోరియల్ పోస్టులకు ఇంటర్వ్యూలు ప్రారంభం

అనంతపురం ఎడ్యుకేషన్: సమగ్రశిక్ష సెక్టోరియల్ పోస్టులకు సోమవారం కలెక్టరేట్‌లో ఇంటర్వ్యూలు నిర్వహించారు. మొత్తం 47 మంది ఇంటర్వ్యూలకు ఎంపిక కాగా.. రెండు రోజుల పాటు ఇంటర్వ్యూలు జరగనున్నాయి. తొలిరోజు 25 మంది అభ్యర్థులకు గాను 22 మంది హాజరయ్యారు. ముగ్గురు గైర్హాజరయ్యారు. మంగళవారం మిగిలిన 22 మందికి ఇంటర్వ్యూలు ఉంటాయని అధికారులు తెలిపారు. ఇంటర్వ్యూ 15 మార్కులకు ఉంటుంది. కమిటీ సభ్యులు అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ తాహర్, డీఈఓ ప్రసాద్‌బాబు, సమగ్రశిక్ష ఏపీసీ శైలజ, డైట్ కళాశాల ప్రిన్సిపాల్ రాజేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

- సూపర్ సిక్స్ పేరుతో ప్రజలను మోసం చేశారు
- గ్రామాల్లో పర్యటించి సమస్యలు తెలుసుకుంటాం
- గ్రామ కమిటీలు ఏర్పాటు చేసి, స్థానిక ఎన్నికలకు సిద్ధం కండి
- త్వరలో 'కార్యకర్తలతో కాఫీ' కార్యక్రమానికి శ్రీకారం
- మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి





రీకాలింగ్ చంద్రబాబూస్ మేనిఫెస్టో క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, సమావేశానికి హాజరైన నాయకులు

మోసం.. చంద్రబాబు నైజం

ఆత్మకూరు: 'అధికారంలోకి వచ్చేందుకు కూటమి నేతలు హామీలు ఇచ్చారు. అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా పథకాలు అమలు చేయడంలో విఫలమయ్యారు. అభివృద్ధి పక్కన పెట్టి అక్రమంగా దోచుకుంటూ ప్రజలను మోసం చేస్తున్నారు. కూటమి మోసాలను ఇంటింటికీ వెళ్లి వివరిద్దాం' అని మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ సమన్వయకర్త తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలోని కనకదాస కల్యాణ మండపంలో 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ' కార్యక్రమాన్ని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మతో కలసి నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో నిరుద్యోగ భృతి రూ.3 వేలు, ఆడబిడ్డనిధి కింద మహిళలకు నెలకు రూ.1500, ఉచితబస్సు, ఉచిత గ్యాస్, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాలతో లబ్ధి చేకూరుస్తామని హామీ ఇచ్చి ఇంత వరకు ఒక్క పథకం కూడా సరిగ్గా అమలు చేయలేదని మండిపడ్డారు. చాలామంది రైతులకు అన్నదాత సుఖీభవ పథకం కింద డబ్బు జమ కాలేదని తెలిపారు. ఇక 'తల్లికి వందనం' పథకం కింద అరకొరగా తల్లులకు ఖాతాలకు నగదు జమ చేశారని మండిపడ్డారు. 50 ఏళ్లకు పింఛన్ ఇస్తామని చెప్పిన చంద్రబాబు.. ఇంత వరకు దాని గురించి పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. గతంలో ముఖ్యమంత్రిగా ఉన్న జగనన్న ఫీజురియింబర్స్‌మెంట్, అమ్మ ఒడి, ఆరోగ్య శ్రీ, నేతన్న నేస్తం, జగనన్న సురక్ష, విద్యా కానుక, డ్వాక్రా రుణాల మాఫీ, వడ్డీ లేని రుణాలు, జగనన్న చేయూత ఇలా ప్రతి పథకం అమలు చేసి రికార్డు సృష్టించారని తెలిపారు. గతంలో జగనన్న పథకాలు అమలు చేస్తే రాష్ట్రం శ్రీలంక అవుతుందని చెప్పిన చంద్రబాబు.. ఇప్పుడు ఏ పథకం అమలు చేయకుండా 14 నెలలకే రూ.2 లక్షల కోట్లు ఎందుకు అప్పు చేశారని ప్రశ్నించారు. ఈవీఎంల ద్వారా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్న విషయం ఇప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా చర్చ జరుగుతోందని తెలిపారు. ప్రజల ఓట్లతో గెలిస్తే బాధ్యత ఉంటుందని.. ఇలా ఈవీఎంలతో గెలిస్తే కూటమి నాయకులకు ఏం బాధ్యత ఉంటుందని విమర్శించారు.

కమీషన్లకు కక్కుర్తి పడుతున్న ఎమ్మెల్యే సునీత

పేరూరు డ్యాంకు నీరు అందించాలన్నది వైఎస్సార్ ఆశయం. పేరూరు డ్యాంకు నీరు అందించి రైతుల కళ్లలో ఆనందం చూశామని తెలిపారు. గతంలో అనంతపురం రూరల్, ఆత్మకూరు మండలాలకు పీఏబీఆర్ కాలువ ద్వారా నీరు అందించడానికి రూ.90 కోట్లతో దాదాపు 80 శాతం పనులు పూర్తి చేస్తే.. అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా 20 శాతం పనులు ఎందుకు పూర్తి చేయలేదన్నారు. హంద్రీ–నీవా కాలువకు లైనింగ్ వేసి రైతులను అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. వైఎస్సార్ హయాంలో కూలీలు రైతులుగా మారితే.. చంద్రబాబు, సునీత హయాంలో రైతులు కూలీలుగా మారుతున్నారన్నారు. ప్రతి పనిలో ఎమ్మెల్యే సునీత కమీషన్లకు కక్కుర్తి పడుతోందని విమర్శించారు. కూటమి హయాంలో దాడులు, దౌర్జన్యాలు, హత్యలు, మానభంగాలు పెరిగిపోయాయన్నారు. లంగమయ్యను హత్య చేసింది వాళ్ల బంధువులే అన్నారు. రామగిరి ఎంపీపీ ఉప ఎన్నిక మూడు సార్లు వాయిదా పడిందన్నారు. ఎంపీటీలు లేకున్నా టీడీపీ నాయకులు దౌర్జన్యం చేస్తున్నారన్నారు. ఓ 15 సంవత్సరాల బాలికను 14 మంది టీడీపీకి చెందిన వారు అత్యాచారం చేసి కడుపు చేస్తే కనీసం ఆ కుటుంబాన్ని పట్టించుకున్న పాపాన పోలేదని మండిపడ్డారు. టీడీపీ నేతలు చేస్తున్న దుర్మార్గాలను ఎదురిస్తామని స్పష్టం చేశారు.

త్వరలో 'కార్యకర్తలతో కాఫీ' కార్యక్రమం

ఇప్పటి నుంచి వారానికి మూడు రోజులు గ్రామాల్లోనే పర్యటిస్తాను. త్వరలోనే 'కార్యకర్తలతో కాఫీ' కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నట్లు ప్రకాష్‌రెడ్డి తెలిపారు. ప్రతి గ్రామంలో గ్రామ కమిటీలతో పాటు అనుబంధ కమిటీలు కచ్చితంగా ఏర్పాటు చేయాలన్నారు. మొత్తం 23 కమిటీలు ఉండాలని.. ఒక్కో కమిటీలో ఐదుగురు చొప్పున సభ్యులు తప్పకుండా ఉండాలని వెల్లడించారు. 2024లో చాలామంది ఓట్లను తొలగించారన్నారు. వాటిని పరిశీలించి తొలగించిన ఓట్లు, 18 సంవత్సరాలు దాటిన వారిని ఓటర్ల జాబితాలో చేర్పించాలన్నారు. రాజకీయాల్లో యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ప్రజా సేవ చేయడానికి తోపుదుర్తి కుటుంబం ఎప్పుడు ముందుంటుందని తెలియజేశారు. అనంతరం చంద్రబాబు మేనిఫెస్టో గుర్తుకు తెస్తూ 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ' క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం



పెద్దన్న కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి

ఆత్మకూరు: మండల కేంద్రానికి చెందిన వైఎస్సార్‌సీపీ వార్డు మెంబర్ పెద్దన్న మూడు రోజుల క్రితం గుండెపోటుతో మృతి చెందాడు. సోమవారం మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పెద్దన్న ఇంటి దగ్గరకు వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అధైర్యపడకండి.. అండగా ఉంటామని భరోసా కల్పించారు. అలాగే అనారోగ్యంతో బాధపడుతున్న వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు ఈశ్వరరెడ్డి పరామర్శించారు. ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు.

చురుగ్గా హెలీప్యాడ్ ఏర్పాటు పనులు



హెలీప్యాడ్ పనులను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యేలు విశ్వేశ్వరరెడ్డి, కేతిరెడ్డి పెద్దారెడ్డి



హెలీప్యాడ్ పనులు చురుగ్గా జరుగుతున్న దృశ్యం

ఉరవకొండ: వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి తనయుడు వై.ప్రణయ్ రెడ్డి, రోహిత వివాహం ఈ నెల 14న అనంతపురంలో జరగనుంది. ఈ వేడుకకు మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి హాజరుకానున్నారు. దీంతో అనంతపురంలోని రుద్రంపేట బైపాస్ వద్ద హెలీప్యాడ్ ఏర్పాటు పనులను ఉరవకొండ, తాడిపత్రి మాజీ ఎమ్మెల్యేలు విశ్వేశ్వరరెడ్డి, కేతిరెడ్డి పెద్దారెడ్డి సోమవారం పరిశీలించారు. హెలీప్యాడ్ పనులు త్వరగా పూర్తి చేయాలని వారు సూచించారు. వారి వెంట పార్టీ నేతలు వెన్నపూస రవీంద్రారెడ్డి, నదీం, జిల్లా అధికార ప్రతినిధి వీరన్న, విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవీన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించండి



మాట్లాడుతున్న డీపీఎం లక్ష్మానాయక్

అనంతపురం అగ్రికల్చర్: అధిక పెట్టుబడులు, తగ్గుతున్న దిగుబడులతో రైతులకు వ్యవసాయ భారమవుతున్న నేపథ్యంలో ప్రకృతి వ్యవసాయాన్ని (నాచురల్ ఫార్మింగ్) పెద్ద ఎత్తున ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని జీరో బేస్డ్ నాచురల్ ఫార్మింగ్ (జెడ్‌బీఎన్‌ఎఫ్) డిస్ట్రిక్ ప్రాజెక్టు డైరెక్టర్ (డీపీఎం) లక్ష్మానాయక్, అనంతపురం డివిజన్ ఏడీఏ జీఎం అల్తాఫ్ అలీఖాన్ తెలిపారు. సోమవారం కక్కలపల్లి ఆర్ఎస్‌కేలో ప్రకృతి వ్యవసాయంపై డివిజన్ ఏఓలు, ఏఈఓలు, ఆర్ఎస్‌కే అసిస్టెంట్లకు మూడు రోజుల శిక్షణ కార్యక్రమం సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డీపీఎం, ఏడీఏలు మాట్లాడుతూ... అధిక దిగుబడులు సాధించాలనే ఆలోచనతో గత కొన్నేళ్లుగా విచ్చలవిడిగా రసాయన ఎరువులు, పురుగు మందుల వాడకం వల్ల భూసారం గణనీయంగా తగ్గిపోయిందన్నారు. రసాయన ఎరువులు వాడకుండా కేవలం గోఆధారిత పోషకాలతో పీఎండీఎస్ పద్ధతిలో ఏడాది పొడవునా పంటలు పండించవచ్చని ఇప్పటికే రుజువైందన్నారు. భవిష్యత్తులో ప్రకృతి వ్యవసాయమే శరణ్యంగా భావించి రైతుల్లో అవగాహన కల్పించాలని సూచించారు.

సంక్షిప్త సమాచారం


ఆ జీఓ రద్దు చేయాలి

అనంతపురం టవర్‌క్లాక్: విద్యార్థి సంఘాలను స్కూల్, కళాశాలలోకి అనుమతించకుండా విడుదల చేసిన జీఓను రద్దు చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర కమిటీ సభ్యుడు బండారు శంకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక జిల్లా పరిషత్ ఎదురుగా ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. విద్యార్థుల సమస్యలపై గళం విప్పే సంఘాల గొంతునొక్కడం దారుణమన్నారు. వెంటనే జీఓను రద్దు చేయకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో తేజ, అశోక్, కుమార్, ప్రదీప్, రాజు, రవి, వంశీ, వినోద్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నవగ్రహారాధన

అనంతపురం కల్చరల్: హెచ్చెల్సీ కాలనీలో కొలువుదీరిన కొల్హాపూరి లక్ష్మీదేవి ఆలయ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా సోమవారం నవగ్రహారాధన, గంగపూజలు, రక్షాబంధన సూత్రవేష్టం తదితర కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. రెవెన్యూ కాలనీలోని రామాలయంలో రెండో రోజు ప్రవచన కర్తలు ఇంద్రగంటి సత్యకిషోర్‌శాస్త్రి సుదర్శన ఆద్య భాగవతంలోని ఘట్టాలను రమణీయంగా వినిపించారు.

కాడ్మియల్ దాసరి మృతి బాధాకరం



అనంతపురం కల్చరల్: ఉమ్మడి అనంతపురం జిల్లా కలెక్టర్‌గా పని చేసిన కాడ్మియల్ దాసరి మృతి బాధాకరమని అరసం (అభ్యుదయ రచయితల సంఘం) రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాచపాలెం చంద్రశేఖరరెడ్డి అన్నారు. అనంత సాహితీ సంస్థల తరపున ఆచార్య రాచపాలెం చంద్రశేఖరరెడ్డి, శ్రీశ్రీ కళావేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుత్తాహరి సోమవారం ఓ ప్రకటనలో సంతాపం తెలిపారు.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

అనంతపురం అర్బన్: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేయాలని ఐఎఫ్‌టీయూ, సీపీఐ ఎంఎల్ నాయకులు డిమాండ్ చేశారు. పేదలకు ప్రభుత్వం ఇంటి స్థలాలు ఇచ్చి పక్కా గృహాలు నిర్మించి ఇవ్వాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. హామీ మేరకు అర్హులైన పేదలకు గ్రామాల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్లు ఇంటి స్థలాలు ఇచ్చి, పక్కా గృహాలు నిర్మించాలన్నారు. యువతకు నిరుద్యోగ భృతి నెలకు రూ.3 వేలు, ఆడబిడ్డ నిధి కింద ఒక్కొక్క మహిళకు నెలకు రూ.1,500 ఇవ్వలేదన్నారు. అనంతరం ఇన్‌చార్జ్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్, సీపీఐఎంఎల్ నాయకులు నాగరాజు, ఏసురత్నం, బహుజన యువసేన రాష్ట్ర అధ్యక్షుడు చంద్రాచర్ల హరి, నాయకులు దావీదు, లక్ష్మీనారాయణ, నరసప్ప, నాగిరెడ్డి, జిలాన్, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ ధర్మకర్త పదవికి దరఖాస్తుల స్వీకరణ

ఆత్మకూరు: పంపనూరులోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలోని ఆలయ ధర్మకర్త పదవి కోసం ఆసక్తి గల వారు దరఖాస్తు చేసుకోవాలని ఆలయ ఈఓ బాబు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు ఫారంతో పాటు ఆధార్ కార్డు, కుల ధృవీకరణ పత్రం, రెండు ఫొటోలు జతపరిచి అనంతపురంలోని దేవదాయ శాఖ కార్యాలయంలో 20 రోజుల్లోపు అందజేయాలని సూచించారు.

గైనిక్ సర్జరీ ఎందుకు చేశారు?

- విచారణ కమిటీ సభ్యుల ప్రశ్నతో తడబడిన డాక్టర్ రమణ నాయక్

అనంతపురం మెడికల్: గైనికాలజిస్టులు చేయాల్సిన సర్జరీని మెడికల్ టర్మినేషన్ ఆఫ్ ప్రెగ్నెన్సీ (ఎంటీపీ) అనుమతులు లేకుండా ఎందుకు చేశారంటూ సర్వజనాస్పత్రి సర్జరీ విభాగానికి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రమణ నాయక్‌ను విచారణ కమిటీ సభ్యులు ప్రశ్నించారు. ఇందుకు డాక్టర్ రమణ నాయక్ నుంచి మౌనమే సమాధానమైంది. బుక్కరాయసముద్రం మండలం చెదళ్ల గ్రామానికి చెందిన రాధమ్మ(29) మృతికి సంబంధించి డాక్టర్ రమణ నాయక్ ఎట్టకేలకు సోమవారం విచారణకు హాజరయ్యారు. విచారణ కమిటీ సభ్యులు ప్రొఫెసర్లు డాక్టర్ నవీన్‌కుమార్, డాక్టర్ షంషాద్‌బేగం, సర్జరీ డాక్టర్ మనోహర్‌రెడ్డి విచారణ చేపట్టి గంటలోపు పూర్తి చేసి నివేదికను జీఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ షారోన్ సోనియా, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఆత్మారాంకు అందజేశారు. సర్జరీ జరిగే సమయంలో అధిక రక్తస్రావమైందని, ఆపేందుకు ప్రయత్నం చేసినా ఫలితం లేకుండా పోయిందని కమిటీ సభ్యులకు డాక్టర్ రమణ నాయక్ నివేదించినట్లు సమాచారం.

లోపించిన పారదర్శకత

కాగా, రాధమ్మ మృతిపై చేపట్టిన విచారణలో పారదర్శకత లోపించిందనే ఆరోపణలు వెల్లువెత్తాయి. సర్జరీలో డాక్టర్ రమణ నాయక్, అనస్థీషియా వైద్యురాలు డాక్టర్ లావణ్యతో పాటు శ్రీకృప ఆస్పత్రికి చెందిన మరికొందరు పాల్గొన్నారు. వాస్తవానికి పీసీపీఎన్‌డీటీ యాక్ట్‌కు సంబంధించి సర్జరీలో పాల్గొన్న అందరినీ విచారణ చేపట్టాల్సి ఉండగా కేవలం డాక్టర్ రమణనాయక్, డాక్టర్ లావణ్యతో పాటు సర్జరీలో పాల్గొనని ఓ పీహెచ్‌సీకి చెందిన సిబ్బందిని బాధ్యులను చేస్తూ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈ భ్రమరాంబదేవి విచారణకు ఆదేశాలు జారీ చేయడం విమర్శలకు తావిస్తోంది. గతంలో ఓ ఆస్పత్రిలో ఇలాంటి ఘటననే చోటు చేసుకుంటే యాక్ట్ ఉల్లంఘన కింద పోలీసులు కేసు నమోదు చేసి, బాధ్యులను జైలుకు పంపిన విషయాన్ని ఈ సందర్భంగా జీజీహెచ్‌లోని పలువురు గుర్తు చేసుకున్నారు. అయితే సర్జరీలో పాల్గొన్న శ్రీకృప ఆస్పత్రి స్టాఫ్‌నర్సులు, ఓటీ టెక్నీషియన్లు, తదితరులను తప్పించడం అనుమానాలకు తావిస్తోంది. పారదర్శకత లోపించిన ఈ అంశంపై కలెక్టర్ లోతుగా విచారణ చేపడితే అసలు దోషులు ఎవరైంది వెలుగుచూసే అవకాశముందని ఆరోగ్యశాఖ వర్గాలంటున్నాయి.

డాక్టర్ సస్పెన్షన్



ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో పనిచేస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రమణ నాయక్‌ను సస్పెండ్ చేస్తూ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్(డీఎంఈ) నుంచి సోమవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. లావణ్య, శ్రీకృప పేరుతో ఆస్పత్రులను నడుపుతూ ఇతర విభాగాలకు సంబంధించి సర్జరీలు చేయడం, తదితర ఆరోపణలపై డాక్టర్ బి.రమణ నాయక్‌ను సస్పెండ్ చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. వైద్య కళాశాల, సర్వజనాస్పత్రి అధికారుల అనుమతి లేకుండా జిల్లా కేంద్రాన్ని విడిచి వెళ్లకూడదని కూడా స్పష్టంగా పేర్కొన్నారు.

ఘనంగా రాఘవేంద్రుల మధ్యారాధన



పాతూరు వ్యాసరాజ మఠంలో పల్లకీ సేవ

అనంతపురం కల్చరల్: మంత్రాలయ రాఘవేంద్ర స్వామి ఆరాధన ఉత్సవాల్లో భాగంగా సోమవారం మధ్యారాధన వేడుకలు ఘనంగా సాగాయి. పాతూరులోని వ్యాసరాజ మఠంలో రాఘవేంద్ర స్వామితో పాటూ వివిధ దేవతామూర్తులను చందన అలంకారం, అనంతరం వివిధ పుష్పాలతో విశేషంగా అలంకరించి ఆరాధించారు. నిర్మాల్య విసర్జన, అష్టోత్తర పారాయణం జరిగాయి. వేదపండితులు రాఘవేంద్రుల దివ్య చరితను వినిపించారు. ఆలయ పరిసరాల్లో పల్లకీ సేవను నిర్వహించిన అనంతరం మహా ప్రసాద వితరణ జరిగింది. వ్యాసరాజ మఠం ధర్మాధికారి రామచంద్ర శ్రీకాంత్, మేనేజర్లు హరినారాయణ, రఘునాథాచార్, నాగరాజారావు తదితరులు పాల్గొన్నారు. ఇక మొదటి రోడ్డు మంత్రాలయ రాఘవేంద్రస్వామి మఠం భక్తజన సంద్రంగా మారింది. మధ్యారాధన సందర్భంగా బృందావనాన్ని సుందరంగా అలంకరించి పూజలు చేశారు.

రాఘవేంద్రుల బోధనలు ఆచరణీయం

అనంతపురం కల్చరల్: మంత్రాలయ రాఘవేంద్ర స్వాముల బోధనలు ఆచరణీయమని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త సద్గురు రవీంద్ర స్వామి అన్నారు. సోమవారం స్థానిక విన్సెంట్ ఫెర్రర్ కాలనీలోని రవీంద్ర స్వామి ఆధ్యాత్మిక ప్రాంగణంలో రాఘవేంద్ర స్వామి ద్వితీయ ఆరాధన వేడుకలు ఘనంగా జరిగాయి. జిల్లాలోని వివిధ మండలాల నుంచే కాకుండా కర్ణాటక నుంచి తరలి వచ్చిన భక్తులను ఉద్దేశించి స్వామి అనుగ్రహ భాషణం చేశారు. రాఘవేంద్ర స్వామి ఆరాధన మహాత్యాన్ని వివరించారు. అనంతరం భక్తులకు గంధ ప్రసాదం, పండ్లు వితరణ చేశారు. సోమవారం తృతీయ ఆరాధన ఉంటుందని తెలిపారు.

రాజ్యాంగాన్ని కాపాడుకుందాం



ప్రతిజ్ఞ చేస్తున్న డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని డీవైఎఫ్ఐ నాయకులు పేర్కొన్నారు. స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక కేఎస్ఆర్ బాలికల జూనియర్ కళాశాలలో పీఠిక ప్రతిజ్ఞ నిర్వహించారు. రాజ్యాంగాన్ని ప్రతి ఒక్కరూ చదివి తమ హక్కులు, బాధ్యతలు తెలుసుకోవాలని విజ్ఞప్తి చేశారు. బాధ్యత గల పౌరులుగా తమ ఓటు హక్కు ద్వారా మెరుగైన ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలన్నారు. రాజ్యాంగంపై అవగాహనతోనే మెరుగైన పౌర సమాజం సాధ్యమన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బాలకృష్ణ, కసాపురం రమేష్ ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు తరిమెల గిరి, డీవైఎఫ్ఐ రాష్ట్ర నాయకులు నూరుల్లా, సురేంద్రబాబు, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

అన్నకు రాఖీతో రక్ష



మాజీ ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డికి రాఖీ కడుతున్న జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ

ఆత్మకూరు: మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డికి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ' కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ప్రకాష్‌రెడ్డికి స్థానిక మహిళలతో కలసి జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ రాఖీ కట్టారు.

ఆత్మకూరులో 'హర్‌ఘర్ తిరంగా'



ఆత్మకూరులో ర్యాలీగా వెళ్తున్న విద్యార్థులు, అధికారులు

ఆత్మకూరు: హర్‌ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా సోమవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు, అధికారులు పెద్ద ఎత్తున ర్యాలీ చేపట్టారు. ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది బైక్ ర్యాలీ నిర్వహించారు. ప్రతి ఒక్కరూ జాతీయ జెండా పట్టుకుని దేశభక్తి చాటారు. పౌరులు దేశభక్తిని చాటాలని ఎంపీడీఓ లక్ష్మీనరసింహ, తహసీల్దార్ లక్ష్మీనాయక్, ఎంఈఓ నరసింహారెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ వెంకటస్వామి సూచించారు. అనంతరం మానవహారంగా ఏర్పడి స్వాతంత్ర్య సమర యోధుల త్యాగాలను వివరించారు.

'కార్పొరేట్ పాఠశాలలకు కొమ్ముకాస్తున్న ప్రభుత్వం'



జీఓ ప్రతులను దహనం చేస్తున్న ఏఐడీఎస్‌ఓ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: కార్పొరేట్ విద్యాసంస్థలకు ప్రభుత్వం కొమ్ము కాస్తోందని ఆలిండియా డెమొక్రటిక్ స్టూడెంట్ ఆర్గనైజేషన్ (ఏఐడీఎస్‌ఓ) రాష్ట్ర అధ్యక్షుడు హరీష్ కుమార్‌రెడ్డి మండిపడ్డారు. పాఠశాలల్లోకి కేవలం ఎస్ఎంసీ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు మినహా ఎవరినీ అనుమతించరాదని పేర్కొంటూ కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడాన్ని వ్యతిరేకిస్తూ సోమవారం స్థానిక టవర్‌క్లాక్ కూడలిలో ఉత్తర్వులను దహనం చేశారు. సమస్యలపై పోరాడే విద్యార్థి సంఘాలను అనుమతించకుండా, పాఠశాలల్లో సమస్యలను నొక్కి పెట్టే ప్రయత్నం చేస్తున్నారన్నారు. విద్యార్థులకు అన్యాయం చేకూర్చే ఉత్తర్వులను ప్రభుత్వం వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి మహేష్, ఏఐడీఎస్‌ఓ నగర అధ్యక్షులు చరణ్ రాజ్, రాష్ట్ర నాయకులు సురేష్, అభిలాష్, త్రినాథ్, చరణ్ తేజ్, సంతోష్, పూజిత, మల్లేష్ పాల్గొన్నారు.

చిన్నారులు క్షేమం

అనంతపురం: అదృశ్యమైన ముగ్గురు చిన్నారుల ఆచూకీని గంటల వ్యవధిలో పోలీసులు కనుక్కుని తల్లిదండ్రులకు అప్పగించారు. వివరాలు.. కమలానగర్‌లో ఉంటున్న హీరాలాల్ ముగ్గురు కుమార్తెలు నగరంలోని రోటరీ క్లబ్ స్కూల్‌లో చదువుతున్నారు. ఉదయం 9 గంటలకు పిల్లలు స్కూల్‌కి రాలేదంటూ పాఠశాల నుంచి తల్లిదండ్రులకు సమాచారం అందింది. తల్లిదండ్రులు అనంతపురం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో చిన్నారులు మిస్సింగ్ అయ్యారని ఫిర్యాదు చేశారు. అనంతపురం వన్‌టౌన్ సీఐ వెంకటేశ్వర్లు ఆదేశాలతో పోలీసులు సీసీ కెమెరాలను పరిశీలించారు. చిన్నారులు ఒకటో రోడ్డులోని శివాలయం వద్దకు వెళ్లినట్లు గుర్తించారు. వెంటనే పోలీసులు శివాలయం వద్దకు వెళ్లి చిన్నారులను పిలుచుకుని వచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు.

'కూటమి మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్తాం'



ఏర్పాట్లను పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

రాప్తాడు: 'సూపర్ సిక్స్ పేరుతో చంద్రబాబు ప్రజలను మోసం చేసి అధికారాన్ని చేజిక్కించుకున్నారు. ఏడాది పాలనలో ప్రజలను నిండా ముంచారు. కూటమి మోసాలను ప్రజలకు వివరించేందుకు 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు' పార్టీ యూత్ మండల కన్వీనర్ బుడ్డారెడ్డి గారి విశ్వనాథ్ రెడ్డి, మాజీ యూత్ మండల కన్వీనర్ చిట్రెడ్డి సత్యనారాయణ రెడ్డి తెలిపారు. మండలంలోని హంపాపురం సమీపంలోని 44వ జాతీయ రహదారి పక్కనే ఉన్న ఆర్‌కె ఫంక్షన్ హాల్‌లో మంగళవారం ఉదయం 9 గంటలకు ×బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ× కార్యక్రమం జరగనుంది. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను సోమవారం వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి హాజరవుతారన్నారు. కూటమి మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్తామన్నారు. ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, నాయకులు పెద్ద ఎత్తున తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు మాచిరెడ్డి చెన్నారెడ్డి, బ్రహ్మానంద రెడ్డి తదితరులు పాల్గొన్నారు.